# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- అభివృద్ధి చెందుతున్న చిన్న ద్వీప దేశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడి సూచించారు.
- పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని బ్రిక్స్ దేశాలు ఖండించాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు.
- భారతదేశం-యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య ఇటీవల ముగిసిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఒక మైలురాయిగా అభివర్ణించారు.
- ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, చిరుధాన్యాల ఉపయోగం, పోషకమైన ఆహారాన్ని (NCERT) పాఠశాల పాఠ్యపుస్తకాల్లో చేర్చుతుందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జే.పీ.నడ్డా అన్నారు.
- భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే వ్యవసాయం, రైతులు సంపన్నం కావడంపై ఆధారపడి ఉంటుందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

==========================

ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా సకాలంలో నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశముంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడి పేర్కొన్నారు. 2025 విపత్తు నిరోధక మౌలిక సదుపాయాలపై అంతర్జాతీయ సదస్సులో వీడియో సందేశం ద్వారా ప్రధానమంత్రి ప్రసంగించారు. 2025 విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల సదస్సులో ఆఫ్రికన్ యూనియన్ చేరడం పట్ల నరేంద్రమోదీ ఈరోజు సంతోషం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందుతున్న చిన్న ద్వీప దేశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక సహాయం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తూ..

(వాయిస్ 35 సెకన్లు)

=============================

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని బ్రిక్స్ దేశాలు ఖండించాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. బ్రెజిల్‌లోని బ్రెసిలియాలో జరిగిన 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌కు భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన స్పీకర్ ఈ రోజు వీడియో సందేశాన్ని పంచుకున్నారు. ఉమ్మడి ప్రయత్నాల ద్వారా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జీరో-టాలరెన్స్ విధానాన్ని అవలంభించాల్సిన అవసరాన్ని బ్రిక్స్ దేశాలు స్పష్టంగా చెప్పాయని ఆయన తెలిపారు. బ్రిక్స్ దేశాల మధ్య పార్లమెంటరీ సహకారాన్ని బలోపేతం చేయడానికి, AI సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడానికి ఆర్థిక విషయాలపై సమిష్టిగా పనిచేయడానికి అర్థవంతమైన చర్చలు జరిగాయని పేర్కొన్నారు. భారతదేశం తదుపరి బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇస్తుందని స్పీకర్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=============================

భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడం, వ్యవసాయాన్ని, రైతులను సంపన్నం చేయడంపై ఆధారపడి ఉంటుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈరోజు మధ్యప్రదేశ్‌లోని సెహోర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాస్త్రవేత్తల సలహాలను ఉపయోగించుకోవడం ద్వారా "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్"ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. మధ్యప్రదేశ్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2018 ప్రాజెక్టు లో భాగంగా 9 వేల 424 కోట్ల రూపాయలతో 7 లక్షల 85 వేల 356 ఇళ్ల నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆమోదం తెలిపారని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

=============================

భారతదేశంపై జరిగే ఏ దాడికైనా గట్టి సమాధానం ఉంటుందని, ఉగ్రవాదులకు, వారి నేరస్థులకు మధ్య ఎలాంటి తేడా ఉండదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. ఈ రోజు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక వార్తా దినపత్రికకు రాసిన కథనాన్ని పంచుకుంటూ... నరేంద్ర మోదీ ఈ విధంగా స్పందించారు. పాక్ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని ఎంతమాత్రం సహించబోమన్న భారత వైఖరిని రక్షణ మంత్రి తన వ్యాసంలో వివరిస్తూ... అందుకు వ్యతిరేకంగా ప్రతీకారం తీర్చుకుంటామని తెలిపారు. పాకిస్తాన్‌తో భవిష్యత్తులో జరిగే ఏ చర్చలయినా ఉగ్రవాదం, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌పైనే ఉంటాయని పేర్కొన్నారు. ఉగ్రవాదం కేవలం భారతదేశ సమస్య మాత్రమే కాదని... ఇది ప్రపంచ సమస్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

విరామం

=============================

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, చిరుధాన్యాల ఉపయోగం, పోషకమైన ఆహారాన్ని (NCERT) పాఠశాల పాఠ్యపుస్తకాల్లో చేర్చుతుందని కేంద్ర ఆరోగ్య మంత్రి జే.పీ.నడ్డా అన్నారు. ఈ రోజు బెంగళూరులో జరిగిన ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవ సమాంతర వేడుకల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారం తినడం ద్వారా ఊబకాయాన్ని ఆపడానికి భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) అవగాహన కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరోగ్యకరమైన సమాజం మాత్రమే బలమైన దేశాన్ని నిర్మించగలదని అన్నారు. వికసిత్ భారత్ గా మారాలంటే, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని జేపీ నడ్డా పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

=============================

భారతదేశం-యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య ఇటీవల ముగిసిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఒక మైలురాయిగా అభివర్ణించారు. ఈరోజు న్యూఢిల్లీలో యుకె విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీతో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఈ ఒప్పందం ద్వైపాక్షిక వాణిజ్య పెట్టుబడులను ముందుకు తీసుకెళ్లడమే కాకుండా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల వ్యూహాత్మక అంశాలపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతుందని అన్నారు. భారతదేశం ఉగ్రవాదంపై జీరో టొలరెన్స్ విధానాన్ని పాటిస్తుందని జైశంకర్ తెలియజేస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

===========================

ఈద్-ఉజ్-జుహా సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను త్యాగం, విశ్వాసం, మానవీయ విలువలకు చిహ్నంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన సందేశంలో పేర్కొన్నారు.

===========================

భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందం ఈ రోజు బెర్లిన్‌లో జర్మన్ ప్రభుత్వం, పార్లమెంట్, మేధావుల ప్రతినిధులతో సమావేశమైంది. భారతదేశం యొక్క సూత్రప్రాయమైన 'ఉగ్రవాదంపై జీరో-టాలరెన్స్' వైఖరిని, సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్ వ్యూహాన్ని వివరించింది. ఉగ్రవాద దాడికి భారత్ దృఢమైన, ఖచ్చితమైన, ప్రతిస్పందనగా నిలిచిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రతినిధి బృందం వారికి వివరించింది. జర్మన్ ప్రతినిధులు భారతదేశం వైఖరికి మద్దతు ప్రకటించారు.

===========================

గడచిన పది సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర పేదరికాన్ని తగ్గించడంలో గణనీయమైన పురోగతి సాధించిందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం, 2011-12లో 27.1 శాతంగా ఉన్న తీవ్ర పేదరికం రేటు 2022-23లో కేవలం 5.3 శాతానికి గణనీయంగా తగ్గింది. 2011-12లో, భారతదేశంలో దాదాపు 34 కోట్ల 44 లక్షల మంది తీవ్ర పేదరికంలో జీవిస్తుండగా.. 2022-23 నాటికి, ఆ సంఖ్య 7 కోట్ల 52 లక్షలకు తగ్గింది.

===========================

కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు ఫ్రాన్స్‌కు బయలుదేరారు. ఐక్యరాజ్య సమితి మహాసముద్ర సమావేశం రేపటి నుండి ఈ నెల 13 వరకు తీరప్రాంత నగరమైన నైస్‌లో జరుగుతుంది. ఉన్నత స్థాయి భారత ప్రతినిధి బృందానికి డాక్టర్ జితేంద్ర సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. సముద్ర పాలన, ప్రపంచ మహాసముద్రాల ఆరోగ్యం కోసం నిర్మాణాత్మకమైన చర్యలను ఈ సమావేశాలలో చర్చిస్తారు.

===========================

===========================